పట్టణ సమస్యలపై నివేదించండి

మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్-ఇన్ నేడు

ఈనాడు మీతోడు



సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారులు, వీధి దీపాలు తదితర అంశాలకు సంబంధించి సమస్యలున్నాయా? వీటితో పాటు మున్సిపల్ పరిధిలోని ఇతర అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' మీకు అవకాశం కల్పిస్తుంది. మీ సమస్యలను ఫోన్ ద్వారా కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్‌కు తెలియజేయండి.

-న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

ఫోన్ నంబరు : 94400 02532

సమయం : శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.

శరన్నవరాత్రోత్సవాలకు భూమిపూజ

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని గాంధీనగర్ మార్కెట్ ప్రాంతంలో తుల్జా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రోత్సవాలకు భూమి పూజ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి గౌరవ అధ్యక్షుడు, స్థానిక మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్ మాట్లాడుతూ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

డీలర్ల నియామకంపై ఆరా

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల

సిరిసిల్ల రెవెన్యూ డివిజన్‌లో చౌకధరల దుకాణాల డీలర్ల నియామకంపై సమగ్ర విచారణ చేపడుతున్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం ఆర్డీవో కార్యాలయంలోని ఈ ప్రక్రియకు సంబంధించిన దస్త్రాలను తీసుకెళ్లింది. దుకాణాలకు ముఖాముఖి జరుగుతున్న సమయంలోనే ఆర్డీవో కార్యాలయం ఆవరణలో పలువురు ఆందోళనకు దిగారు. దీని తర్వాత నాలుగు రోజులకు సిరిసిల్లలోని దుకాణాలకు ఎంపికైన డీలర్లకు రాత్రి సమయంలో తహసీల్దార్ కార్యాలయంలో నియామక పత్రాలను అందించారు. మిగతా మండలాల వారికి మరుసటి రోజు అందజేశారు. ఆందోళనలు, ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం రంగంలోకి దిగింది. ఉత్తర్వులు వెలువడిన తేదీ నుంచి నియామక పత్రాలు అందజేసే వరకు జరిగిన తీరుపై ఆరా తీస్తుంది.

అసలేం జరిగిందంటే...

2014 నుంచి డివిజన్‌లో చౌక ధరల దుకాణాలు పలు కారణాలతో ఖాళీ అవుతూ వస్తున్నాయి. మరి కొన్నింటిని కొత్తగా ఏర్పాటు చేశారు. తాత్కాలిక ఉత్తర్వుల ద్వారా వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించారు.

★ సంక్షేమ పథకాల అమలులో రేషన్‌కార్డులు, చౌకధరల దుకాణాల వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే దుకాణాలకు పూర్తిస్థాయి బాధ్యులను నియమించాలని ప్రణాళిక చేసింది.



రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు చేరిన దస్త్రాలు

★ జిల్లాలోని సిరిసిల్ల డివిజన్‌లో ఖాళీగా ఉన్న 58 దుకాణాలకు ఆగస్టు 29న ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబరు 4లోపు దరఖాస్తుల స్వీకరణ, 15న సిరిసిల్ల పట్టణంలో రాత పరీక్ష నిర్వహించారు. 58 దుకాణాలకు 830 మంది దరఖాస్తు చేసుకోగా 765 మంది రాత పరీక్షకు హాజరయ్యారు. 100 మార్కుల్లో రాత పరీక్షకు 80, ముఖాముఖికి 20 మార్కులు కేటాయించారు.

★ గంభీరావుపేటలో ఒడ్డెర కాలనీ, దమ్మన్నపేట, తంగళ్లపల్లిలో గండిలచ్చపేట, జిల్లెల్ల గ్రామంలోని ఇందిరానగర్, ఎల్లారెడ్డిపేటలో హరిదాస్‌నగర్, రాగట్లపల్లి ఇలా ఆరు దుకాణాలకు కేటాయించిన రిజర్వేషన్లలో అభ్యర్థులు లేక ఎవరూ ముందుకు రాలేదు.

★ ఈ నెల 21న 52 దుకాణాలకు రిజర్వేషన్లు, రాత పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా 181 మందిని ముఖాముఖికి పిలిచారు. వీరి మెరిట్ జాబితాను ఎక్కడా ప్రచురించకపోవడం, ముఖాముఖి తర్వాత నియామక పత్రాలు ఇచ్చే ముందు రోజు మండలాల వారీగా జాబితాను కార్యాలయాల్లో ఉంచడం గమనార్హం. స్థానికంగా పలుకుబడి కలిగిన నాయకులు రంగ ప్రవేశం చేసి తమ అనుయాయులకు నియామక పత్రాలు ఇప్పించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

★ దాదాపు పదేళ్లుగా దుకాణాల్లో పని చేస్తున్న వారు డీడీలు చెల్లించడం, సరకుల పంపిణీ అంతా రికార్డుల్లో మహిళా సంఘాల పేరునే ఉన్నాయి. గత ప్రభుత్వం తాత్కాలిక నిర్వాహకులకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చింది. కానీ అది అమలుకు నోచుకోలేదు. నియామక ప్రక్రియ చేపట్టడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ప్రత్యేక బృందం డీలర్ల ఎంపికపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తోంది. దీని తర్వాత వాస్తవాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంది.

వేములవాడ మార్కెట్ కమిటీపై ఉత్కంఠ

న్యూస్‌టుడే, వేములవాడ

గత కొన్ని రోజులుగా వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం నియామకంపై ఉత్కంఠ కొనసాగుతోంది. చాలా మంది ఆశావహులు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. వేములవాడ కమిటీ ఎస్సీలకు రిజర్వ్ కావడంతో ఆ వర్గానికి చెందిన కొంత మంది సీనియర్ నాయకులు, పార్టీ కష్టకాలంలోనూ వెన్నంటి ఉన్నవారు ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. పోటీ ఎక్కువ ఉండటంతో పాలకవర్గం నియామకంలో జాప్యం నెలకొందన్న ప్రచారం ఉంది.

రాష్ట్రంలోని చాలా మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను ప్రభుత్వం నియమించింది. జిల్లాలోని సిరిసిల్ల, వీర్నపల్లి, రాచర్ల బొప్పాపూర్, గంభీరావుపేట, పోత్గల్ మార్కెట్ కమిటీలకు సైతం నియమించింది. జిల్లాలో రుద్రంగి, కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ మార్కెట్ కమిటీలతో పాటు గ్రేడ్-1 గా ఉన్న వేములవాడకు పాలక వర్గాలను ఇంకా ప్రకటించలేదు. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రం కావడంతో వేములవాడకు ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఇక్కడ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆశీస్సులు ఎవరికి ఉంటాయోనన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.

ప్రకటించడమే ఆలస్యం..

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీల ఛైర్మన్, డైరెక్టర్ల పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇందులో కొన్నింటికి పాలకవర్గాలను ప్రకటించగా, మరికొన్నింటికి ఆయా ప్రాంతాల నాయకుల అభిప్రాయం మేరకు మార్పులు, చేర్పుల కోసమే కొంత జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఆశావహుల ఎదురుచూపు



వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

✧ జిల్లాలో వేములవాడ మార్కెట్ కమిటీపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గ కేంద్రం కావడంతో అందరి దృష్టి దీనిపైనే ఉంది. ఇక్కడి పాలక వర్గం నియామకంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఇక్కడ దాదాపు నలుగురు నాయకులు పోటీ పడుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఇద్దరు నాయకులకు జడ్పీటీసీ, ఇతర పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామన్న హామీ మేరకు విరమించుకోగా, మిగతా ఇద్దరి మధ్య పోటీ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

✧ వేములవాడ ఏఎంసీ పరిధిలోనే రుద్రంగి, బోయినపల్లి, నిజామాబాద్‌లు గతంలో సబ్ మార్కెట్లుగా ఉండేవి. వీటిని మార్కెట్ కమిటీలుగా ప్రభుత్వం ప్రకటించి ఉత్తర్వులు జారీ చేయడంతో పాలకవర్గాలను నియమించారు.

✧ వేములవాడ, రుద్రంగి, నిజామాబాద్ మార్కెట్ కమిటీలకు కూడా ఒకటి, రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని జిల్లా మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి ప్రకాశ్ పేర్కొన్నారు.

తెలంగాణ గర్వించే గొప్ప నేత కొండా లక్ష్మణ్ బాపూజీ

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాలు, తెలంగాణ సాధన కోసం జీవితాంతం పోరాడిన గొప్ప నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ కూడలి వద్ద ఆయన విగ్రహానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా వేడుకలు జరుపుకోవాలన్నారు. సిరిసిల్లలో మార్కండేయ దేవాలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. నేతన్నలు అధైర్య పడవద్దని, మీ వెంట ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగీతం శ్రీనివాస్, మహిళా నాయకులు వెలుముల స్వరూప, కాముని వనిత, భారాస నాయకులు గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు రాగుల రాములు, నాయకులు ఆకునూరి శంకరయ్య, గడ్డం నర్సయ్య, భాజపా నాయకుడు ఆడెపు రవీందర్, పద్మశాలి సంఘం, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కళ, నాయకులు

పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలని అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. శుక్రవారం సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌లో ధోబీఘాట్, క్షౌరశాలల నిర్మాణానికి జిల్లా పోలీస్ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా బెటాలియన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. తరవాత సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ క్రమశిక్షణ కలిగిన ఆర్గనైజేషన్ అన్నారు. బెటాలియన్ అభివృద్ధిలో అధికారులు, సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు. అంతకు ముందు సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీరాజ్ వసతి గృహంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, 17వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు సాంబశివరావు, ఉదయభాస్కర్, రామదాసు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రమీల, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



17వ బెటాలియన్‌లో శంకుస్థాపన చేస్తున్న అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్



అల్పాహారం.. మహోపకారం

దాతలు స్పందిస్తే విద్యార్థులకు మేలు

ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే, సిరిసిల్ల విద్యానగర్

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులు చదువుతుంటారు. పేదరికం.. ఇంట్లో తల్లిదండ్రులు ఉదయమే కూలీ పనులకు వెళ్లడం తదితర కారణాలతో ఏమీ తినకుండానే పాఠశాలలకు వెళ్తున్నారు. అసలే పోషకాహార లోపాలతో బాధపడుతున్న వారు సరైన సమయానికి అల్పాహారం అందక నీరసపడిపోతున్నారు. తరగతి గదుల్లో బద్ధకంగా ఉండటం, పాఠాలు సరిగా అర్థం చేసుకోలేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వం గతేడాది అక్టోబరు 6న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టి ప్రయోగాత్మకంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న బడుల్లో అమలు చేసింది.. ఈ ఏడాది జనవరి వరకు అల్పాహారం, ఆగస్టు వరకు రాగిజావ అందించారు. త్వరలోనే కొన్ని మార్పులు చేసి అల్పాహారం పథకం పునః ప్రారంభించే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆలోపు దాతలు స్పందిస్తే చిన్నారులకు ఇబ్బందులు తప్పించినవారవుతారు.

నియోజకవర్గంలో 200 మంది విద్యార్థులకు పైబడి ఉన్న పాఠశాలలకు ఉదయం అల్పాహారం అందిస్తా. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం చిరుతిళ్లు అందజేస్తా.

- బుధవారం గర్రెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఉమ్మడి జిల్లా వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు :
3,312	3,78,005 మంది

అందరూ కలిసి అండగా నిలిస్తే!

సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు అయిదేళ్లపాటు ఉదయం రాగిజావ పంపిణీ చేశారు. దీంతో ఇంటి వద్ద ఉదయం తినిరాని విద్యార్థులకు కొంత ఉపయోగపడేది. ఈ విద్యా సంవత్సరం ఆగస్టు వరకు రాగిజావ పంపిణీ చేసి ఆపేశారు. అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వంతో ఒప్పంద గడువు ముగియడంతో నిలిచిపోయిందని చెబుతున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ఖాళీ కడుపులతో మధ్యాహ్నం వరకు పాఠాలు వినాల్సి వస్తుంది. 100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో రోజూ రాగి జావ పంపిణీ చేయాలంటే దాదాపు రూ.300 వరకు ఖర్చు అవుతుంది. నెలకు రూ.9 వేలు, 10 నెలలకు రూ.90 వేలతో 100 మంది విద్యార్థులకు విద్యా సంవత్సరమంతా రోజూ పంపిణీ చేయొచ్చు. ఒక పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉన్నా సంవత్సరానికి ఈ ఖర్చు రూ.4.5 లక్షలు దాటదు. ప్రభుత్వం స్పందించి అల్పాహారం ఏర్పాటు చేసే వరకు ఆగకుండా ఏ గ్రామానికి ఆ గ్రామంలో నాయకులు, దాతలు స్పందిస్తే చిన్నారులకు ఆకలి బాధలు తప్పుతాయి. బాగా చదువుకోగలుగుతారు.



సుల్తానాబాద్ : దేవునిపల్లి పాఠశాలలో గతేడాది రాగి జావ పంపిణీ

చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నా..



ఉదయం ఇంట్లో అల్పాహారం తినకుండా బడికి రావాల్సిన పరిస్థితి నాది. మధ్యాహ్న భోజనం వరకు వేచి ఉండాల్సి రావడంతో చదువుపై శ్రద్ధ వహించలేకపోతున్నా. ప్రభుత్వం స్పందించి అల్పాహారం పునరుద్ధరించాలి.

- రిత్విక్, పదో తరగతి, కుసుమ రామయ్య జడ్పీహెచ్ఎస్ (బాలురు), సిరిసిల్ల

నేరుగా మధ్యాహ్న భోజనం తింటున్నా



ప్రతి రోజూ వడ్డెర కాలనీ నుంచి ఆర్టీసీ బస్సులో 10 కిలోమీటర్ల దూరంలో ఉండే ఒద్యారం జడ్పీహెచ్ఎస్‌కు వస్తుంటా. ఉదయం 8 గంటలకే బయల్దేరి వస్తా. రాగిజావ, అల్పాహారం పంపిణీ నిలిచిపోవడంతో మధ్యాహ్న భోజనం వరకు ఆకలితో ఉండాల్సిందే. ఉపాధ్యాయులను అడిగితే ప్రభుత్వం నుంచి సరఫరా లేదని చెబుతున్నారు.

- తోక సాయికుమార్, ఒద్యారం, గంగాధర మండలం, కరీంనగర్

రాజన్నను దర్శించుకున్న భువనేశ్వరి పీఠం స్వామి

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామిని భువనేశ్వరి పీఠం కమలానంద భారతి స్వామి దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఈవో వినోద్‌రెడ్డి కల్యాణ మండపంలో పండ్లు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు అశోక్, ఆలయ పర్యవేక్షకులు నర్సయ్య, నరసింహాచారి, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ పథకంలో అభివృద్ధి పనులకు పరిశీలన

వేములవాడ, న్యూస్‌టుడే: దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ఆర్కిటెక్ట్ కిశోర్‌కుమార్, ప్లానర్ మౌనికలు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, స్థపతి వల్లినాయగం, పర్యవేక్షక ఇంజినీర్ దుర్గా ప్రసాద్‌లతో కలిసి పరిశీలించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం వంద వసతి గదుల నిర్మాణం, అన్న ప్రసాద భవనం, క్యూ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు సంబంధించి అధికారులు ఆలయంలో, పార్కింగ్ స్థలంలో పరిశీలన చేశారు. అనంతరం అధికారులు పూర్తి స్థాయి నివేదికను తయారు చేశారు. అంతకు ముందు వారు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేశ్, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈ రాంకిషన్‌రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెనక్కి మళ్లిన నిధులు.. మారని రహదారి రూపు

రెండు జిల్లాల ప్రజల కల నెరవేరేదెప్పుడో?



ముస్తాబాద్ నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు దుస్థితి

న్యూస్‌టుడే, ముస్తాబాద్

దీర్ఘకాలంగా ఇరు జిల్లాల రహదారి పూర్తి కాక ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడినా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా మళ్లీ వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో రెండు జిల్లాల ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. వాహనదారులు, ప్రజల కష్టాలు తీరలేదు.

ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఏళ్లుగా రెండు జిల్లాల వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముస్తాబాద్-దుబ్బాక రోడ్డు మంజూరు విషయంలో అప్పటి ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి దుబ్బాక ఎమ్మెల్యేలు పలుమార్లు అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించారు.

● మంత్రి కేటీఆర్ చొరవతో ముస్తాబాద్ నుంచి మోహినికుంట మీదుగా దుబ్బాక వరకు 2023 జనవరిలో ఇరు వరుసల రహదారి మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ముస్తాబాద్ నుంచి దుబ్బాక వరకు 14 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 26 కోట్లు మంజూరు చేశారు.

● దుబ్బాక నుంచి రాజక్కపేట శివారు వరకు 8.4 కిలోమీటర్లకు రూ. 12 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. మొదటి లేయర్ బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. రెండో లేయర్ వేయాల్సి ఉంది.

● ముస్తాబాద్ నుంచి మోహినికుంట శివారు వరకు 5.6 కిలో మీటర్లకు రూ.14 కోట్లు కేటాయించారు. 2023 జనవరిలో నిధులు మంజూరు కాగా పనులు చేపట్టలేదు. 2024 ఫిబ్రవరిలో నిధులు వెనక్కి వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు.

● భారాస హయాంలో నిధులు మంజూరు కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు వెనక్కి వెళ్లడంతో రహదారి నిర్మాణం చేపట్టలేదు. దీంతో రెండు వరుసల రహదారి కలగా మారింది. దీంతో మళ్లీ ఎప్పుడు నిధులు వస్తాయో, రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పక్కా రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

అధ్వానంగా ఉంది



ముస్తాబాద్ నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు గ్రామ పంచాయతీ కార్యాలయం మొదలుకొని మోహినికుంట శివారు వరకు అధ్వానంగా ఉంది. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వాలంటే భయంగా ఉంది. అధ్వానంగా ఉన్న రోడ్డుతో భయంగా వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. పక్క జిల్లాలో దుబ్బాక నుంచి రాజక్కపేట శివారు వరకు ఇరు వరుసల రోడ్డు పనులు పూర్తయ్యాయి. ముస్తాబాద్ నుంచి మోహినికుంట శివారు వరకు మాత్రం అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ తీసుకొని నిధులు మంజూరయ్యేలా చూడాలి.

- మహ్మద్ ఇక్బాల్, ఆటో డ్రైవర్, ముస్తాబాద్

నిధులు తిరిగి రప్పించాలి



రహదారులకు భారాస ప్రభుత్వం పెద్దపీట వేసింది. అందులో భాగంగానే ముస్తాబాద్ నుంచి సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట శివారు వరకు రూ. 14 కోట్లు మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రాగానే నిధులు వెనక్కి వెళ్లాయి. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వెనక్కి వెళ్లిన నిధులను తిరిగి రప్పించాలి. ఇరువరుసల రహదారి పనులు చేపట్టేలా చొరవ చూపాలి. ఇరు జిల్లాల ప్రజల కల సహకారం చేయాలి.

- భూంపెల్లి సురేందర్‌రావు, భారాస మండల అధ్యక్షుడు

మంత్రి, విప్‌ల దృష్టికి తీసుకెళ్లి...



గత ప్రభుత్వ హయాంలో రెండు జిల్లాలను అనుసంధానం చేసే రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. సకాలంలో పనులు చేపట్టకపోవడం వల్ల వెనక్కి వెళ్లిపోయాయి. భారాస నాయకులు మాత్రం కాంగ్రెస్ పార్టీని బద్నాం చేస్తున్నారు. సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తాను.

- ఏళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

డీఎస్సీ 2008 బాధితుల జాబితా విడుదల

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

ఉమ్మడి జిల్లాలోని డీఎస్సీ- 2008 బాధిత అభ్యర్థుల జాబితాను ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. డీఎస్సీ అర్హత సాధించి ఉద్యోగాలకు దూరమైన వారికి ప్రభుత్వం ఒప్పంద పద్ధతిన ఎస్జీటీ ఉద్యోగాలను కల్పించేందుకు ముందుకు వచ్చింది. సంబంధించిన అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని రాష్ట్ర విద్యాశాఖ సూచించింది. దీంతో జిల్లా విద్యాశాఖ ఉమ్మడి జిల్లాలో 61 మంది బాధిత అభ్యర్థులున్నట్లు రెండు రోజుల క్రితం ప్రకటించారు. అందులో ఉద్యోగాలు వారుండటం, నష్టపోయిన అభ్యర్థుల పేర్లు లేకపోవడంతో బాధిత అభ్యర్థులు ఆందోళన చెందారు.

186 మందితో

వందనం

అభ్యర్థుల ఆందోళనపై 'అసలే ఆలస్యం.. ఆపై ఆవేదన' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యాశాఖ 61 మంది జాబితాను వెబ్‌సైట్ నుంచి తొలగించారు. వాస్తవంగా ఉద్యోగాలకు అర్హత సాధించి వాటికి దూరమైన 186 మంది అభ్యర్థులతో కొత్తగా జాబితాను జిల్లా విద్యాశాఖ రూపొందించి రాష్ట్ర విద్యాశాఖకు పంపించారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దాన్ని పొందుపర్చడంతో బాధిత అభ్యర్థులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే 186 మంది కాకుండా మొత్తం 228 మంది ఉన్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. డీఎస్సీ ఫలితాల మెరిట్ జాబితాలో ఉన్న పలువురు అభ్యర్థులు కొత్తగా ప్రకటించిన జాబితాను చూసి ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగార్హత సాధించి నష్టపోయిన తమ పేర్లు జిల్లా విద్యాశాఖ ప్రకటించిన రెండో జాబితాలోనూ లేవని అభ్యర్థులు వై.వేణుగోపాల్, ఎస్.రాజిరెడ్డిలు పేర్కొన్నారు. దీనిపై పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

బాధిత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ప్రారంభమైంది. వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహిస్తామని డీఈవో పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన ఒక సెట్ జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకురావాలని తెలిపారు. శుక్రవారం 25 మంది వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేసినట్లు జిల్లా విద్యాశాఖ సిబ్బంది పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితా ప్రకటించడం, అప్పటి నుంచే పరిశీలన కార్యక్రమాన్నీ చేపట్టడం, పరిశీలన తేదీల విషయ సమాచారం సాయంత్రం విడుదల చేయడం వంటివి ఒక్కరోజులోనే జరిగిపోవడం గమనార్హం.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం!



న్యూస్‌టుడే, మల్లాపూర్

■ రీచ్‌ల గుర్తింపులో అధికారుల నిర్లక్ష్యం
■ గోదావరి, వాగుల నుంచి అక్రమ రవాణా

జగిత్యాల జిల్లా కలెక్టర్ ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ.. కిందిస్థాయి మైనింగ్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంతో ఇసుక వ్యాపారులు చెలరేగిపోతున్నారు. మల్లాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి మండలాల పరిధిలో ప్రవహిస్తున్న పెద్దవాగు నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద మొత్తంలో వాగుల్లో ఇసుక నిల్వలు ఏర్పడటం అక్రమార్కుల పాలిట వరంగా మారింది. కొరత తీర్చేందుకు జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఇసుక డిపోలపై అధికారులు దృష్టి సారించడం లేదు. జిల్లాలో పెద్దవాగు, గోదావరి ఇసుకకు డిమాండ్ ఉండటంతో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు ఆయా గ్రామాల్లోని నదుల నుంచి నేరుగా రవాణా చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, లారీలను పట్టుకుంటున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు. జిల్లాలో ఇసుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని అవసరమైన రీచ్‌లను ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇసుక అక్రమ రవాణాదారులు ఇష్టానుసారంగా ధరలను నిర్ణయిస్తూ రాత్రి, పగలు తేడా లేకుండా అందినకాడికి దోచుకుంటున్నారు. రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుకను విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి. జగిత్యాల చుట్టుపక్కల ఉన్న జిల్లాలో ఇలాంటి ఏర్పాట్లు ఉన్నప్పటికీ జిల్లాలో మాత్రం అధికారులు రీచ్‌లను ఏర్పాటు చేయడంలేదు. మరోవైపు గోదావరి పరివాహక మండలాలతో పాటు వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు.



వెంపల్లి శివారులోని పెద్దవాగులో ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం

ట్రాక్టర్లలో తీసుకొచ్చి టిప్పర్లతో తరలింపు

నిత్యం పెద్దవాగులో విస్తారంగా ఉన్న ఇసుకను కూలీల సాయంతో ట్రాక్టర్లతో తీసుకువచ్చి రహదారికి సమీపంలో డంపులు ఏర్పాటు చేస్తారు. రాత్రి వేళ డంపుల నుంచి టిప్పర్లలో పట్టణ ప్రాంతాలకు తరలిస్తారు. మల్లాపూర్, కోరుట్ల మండలాల నుంచి టిప్పర్లలో నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాలకు పంపుతున్నట్లు తెలుస్తోంది. డిమాండ్‌ను బట్టి కొన్ని సందర్భాల్లో హైదరాబాద్ వరకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

రెవెన్యూ, పోలీస్ శాఖలు అభాసుపాలు

ఇసుక విషయంలో రెవెన్యూ, పోలీస్ శాఖలు అభాసుపాలవుతున్నాయి. స్థానికంగా అనుమతి ఉన్న రీచ్‌లు లేకపోవడంతో జిల్లాలో గోదావరి తీర ప్రాంతాలతో పాటు వాగుల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనికి తోడు ఆయా శాఖల అధికారులకు భారీగా ముడుపులు అందుతుండటంతో అటువైపు చూడటంలేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అడపాదడపా తనిఖీలు జరుపుతూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఇసుక రవాణాను అరికట్టలేకపోతున్నారు. ఈ దందాపై ఉన్నతస్థాయి అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



రాయమల్లు

బోయినపల్లి, న్యూస్‌టుడే: బోయినపల్లి మండలం వరదవెల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన దేవయ్య, రాయమల్లు (40) అన్నదమ్ములు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లిలో దేవయ్య, రాయమల్లు పెద్దమ్మ మృతి చెందడంతో అంత్యక్రియలకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం ఒద్యారానికి చెందిన మరో పెద్దమ్మ కొడుకు ఎల్లయ్యను దింపడానికి బోయినపల్లి మీదుగా వస్తున్నారు. వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న అదే గ్రామానికి చెందిన అంజయ్య ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో రాయమల్లు, దేవయ్య, ఎల్లయ్య కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా రాయమల్లు మృతి చెందాడు. అతనికి భార్య రూప, కొడుకులు రఘు, గుణ ఉన్నారు. అంజయ్యను వేములవాడ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

కోడలు, మనవరాలిని కాపాడబోయి విషాదం



రాజయ్య

ధర్మారం, న్యూస్‌టుడే: కోడలు, మనవరాలిని విద్యుదాఘాతం నుంచి కాపాడబోయి కూలీ మృతి చెందిన ఘటన ధర్మారం మండలం కటికెనపల్లిలో విషాదం నింపింది. ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన మామిడి రాజయ్య(55) ఇంట్లో శుక్రవారం దుస్తులు ఆరేసుకునే దండేనికి విద్యుత్తు సరఫరా అయింది. ఇల్లు కడుగుతున్న రాజయ్య కోడలు శిరీష దాన్ని తాకడంతో షాక్ కొట్టింది. అక్కడే ఉన్న ఆమె కూతురు సంకీర్తనకూ విద్యుత్తు ప్రసారం కావడంతో ఇద్దరూ కేకలు వేశారు. ఇంటి బయట ఉన్న రాజయ్య వెంటనే ఇంట్లోకి వెళ్లి వారిని కాపాడే ప్రయత్నంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. శిరీష, సంకీర్తనలను ఆసుపత్రికి తరలించారు. రాజయ్యకు భార్య, ఇద్దరు కొడుకులున్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగికి జైలు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ లంచం తీసుకున్న కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన మోకరాల శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ కోలం ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన నరసింహారెడ్డి.. రికార్డుల నిర్వహణ సరిగా లేని కారణంగా వారంపాటు సస్పెన్షన్‌కు గురయ్యారు. తదుపరి ప్రాజెక్టు డైరెక్టర్ అతడి సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ ఆ వారం రోజులను ఎర్నెడ్ సెలవుల కింద పరిగణించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయాలని 2009, ఏప్రిల్ 13న ఉట్నూర్‌లోని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మోకరాల శ్రీధర్‌ను నరసింహారెడ్డి ఆశ్రయించగా రూ.మూడు వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో నరసింహారెడ్డి 2009, ఏప్రిల్ 23న ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా అనిశా ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్.. రూ.3 వేల లంచం తీసుకున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. తదుపరి ఇన్‌స్పెక్టర్ మోహన్.. కోర్టులో ఈ మేరకు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిషోర్‌కుమార్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి కుమార్ వివేక్ శుక్రవారం శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు నమోదు చేసినప్పుడు శ్రీధర్ వయసు 56 సంవత్సరాలు. ప్రస్తుతం 70 ఏళ్ల వయసులోనూ ఆయనకు శిక్ష తప్పకపోవడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాకు మోస్తరు వర్షసూచన

జగిత్యాల వ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో రాగల అయిదురోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షంకురిసే అవకాశముందని పొలాస పరిశోధనస్థానం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 22-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32-36 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

రేపట్నుంచి రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

టీజీఎస్- ఆర్టీసీ పర్యావరణహితంతోపాటు ఇంధన భారం తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఎలక్ట్రిక్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తోంది. ఇందుకోసం జేబీఎం సంస్థతో ఒప్పందం కూడా చేసుకుంది. ఇందులో భాగంగా కరీంనగర్ రీజియన్‌కు 70 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించారు. మొదటి విడతగా ఇప్పటికే 35 సూపర్‌లగ్జరీ బస్సులు కరీంనగర్‌కు చేరుకున్నాయి. వాయిదా పడుతూ వస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభానికి ముహూర్తం నిర్ణయించారు.

కరీంనగర్-2 డిపో కేంద్రంగా..

ఎలక్ట్రిక్ బస్సులను కరీంనగర్-2 డిపో కేంద్రంగా నడుపుతారు. ఇందుకోసం డిపో ఆవరణలో అవసరమైన ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఈ ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణికుల కోసం అధునాతన సౌకర్యాలు కల్పించారు. ఆర్టీసీ వీటిని అద్దె ప్రాతిపదికన నడపనున్నారు. చోదకులతోపాటు ఇతర నిర్వహణ మొత్తం జేబీఎం సంస్థే చూసుకుంటుండగా ఆర్టీసీ మాత్రం కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇప్పటికే జేబీఎం సంస్థ డ్రైవర్లను నియమించుకొని వారికి శిక్షణ కూడా ఇచ్చింది.

ఏర్పాట్లు పూర్తి

ఎలక్ట్రికల్ బస్సులు రహదారిపై పరుగులు తీయడానికి అవసరమైన ఏర్పాట్లను ఆ సంస్థ పూర్తి చేసింది. బస్సుల రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర ప్రక్రియలను పూర్తి చేసింది. మరో 4 డీలక్స్ బస్సులు వచ్చినా వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్, ఇతర ప్రక్రియలు మాత్రం పూర్తి కావాల్సి ఉంది.

కరీంనగర్ నుంచి..

మార్గం	బస్సుల సంఖ్య
జేబీఎస్	39
గోదావరిఖని	9
మంథని	4
కామారెడ్డి	6
జగిత్యాల	6
రాజన్న సిరిసిల్ల	6

(ఇలా రూట్ వారీగా బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించినా.. మొదటి విడతలో వచ్చిన బస్సుల్లో 33 బస్సులను కేవలం జేబీఎస్‌కు మాత్రమే నడపనున్నారు. రెండు బస్సులు స్పేర్‌గా ఉంచుతారు. రెండో విడతలో వచ్చే బస్సులను ఇతర ఎంపిక చేసిన మార్గంలో నడపనున్నారు.)



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బస్సులు

జిల్లాకు రానున్న మంత్రులు

ఈ నెల 29న ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంత్రులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంస్థ ఎండీ సజ్జనార్ కరీంనగర్ రానున్నారు. అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు మంత్రుల చేతుల మీదుగా ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం జరగనుంది. ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌ఎం సుచరిత తెలిపారు.

పత్తి గరిష్ఠ ధర రూ.7,400

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 36 ట్రాలీల పాత, కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. విడిపత్తి క్వింటాలుకు రూ.కనిష్ఠ ధర రూ.7,000.. గరిష్ఠ ధర రూ.7,400 పలికింది. బస్తాల పత్తి రూ.6 వేల నుంచి రూ.7,700 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. కొత్తపత్తిని విక్రయానికి తీసుకొచ్చిన రైతులను మార్కెట్ కార్యదర్శి రాజా సన్మానించారు.

పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఆగస్టులో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్, డాటా సైన్స్, మ్యాథమెటిక్స్) నాలుగు, రెండో సెమిస్టర్ ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నాలుగో సింహానికి ఏమైంది?

తరచూ వివాదాల్లో పోలీసులు



■ కరీంనగర్ రెండో ఠాణాలో గతంలో పనిచేసిన ఓ సీఐ ఈ నెల 20న సస్పెండ్ అయ్యారు. నగరంలోని ఓ వ్యాపారి ఫైనాన్స్ కార్యాలయానికి సంబంధించి రూ.19,66,900లను తనిఖీల్లో భాగంగా ఆ సీఐ ఆధ్వర్యంలో పట్టుకెళ్లారు. నిబంధనల ప్రకారం బాధితుడికి తిరిగి ఇచ్చే నగదులో సీఐ కేవలం రూ.9లక్షలు మాత్రమే ఇచ్చి మిగతాది ఇచ్చేది లేదని, డబ్బు అడిగితే వేరే కేసులో ఇరికించి ఇబ్బందులు పెడుతానని హెచ్చరించారు. బాధితుడు భయంతో హైదరాబాద్‌కు మకాం మార్చారు. అక్కడి ఉన్నతాధికారులతోపాటు కరీంనగర్ సీపీని కొన్నాళ్ల కిందట కలిసి తన గోడుని వెలిబుచ్చడంతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు సీఐ అక్రమాన్ని గుర్తించి విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

■ జగిత్యాల జిల్లాలో పని చేస్తున్న మహిళా ఎస్సై తీరుపై ఇటీవల ఆరోపణలు వచ్చాయి. భార్యాభర్తల కేసు విషయంలో కౌన్సెలింగ్ చేయకుండా ఎస్సై కొట్టడంతో తన సోదరుడు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆయన సోదరి రెండు రోజుల కిందట వీడియో విడుదల చేశారు. చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతి చెందాడు.

■ జగిత్యాల జిల్లాలోని ఓ మహిళా కానిస్టేబుల్ ఇంటి వద్ద జరిగిన గొడవ విషయంలో మరో మండలానికి చెందిన ఎస్సైపై ఆరోపణలు వచ్చాయి. అధికారులు విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించగా చర్యలు కూడా తీసుకున్నారు.

ఈనాడు, కరీంనగర్

ప్రజల మన్ననలు పొందుతూ మెరుగైన సేవలు అందించాల్సిన పోలీసు శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది దుందుడుకుగా వ్యవహరిస్తూ, వక్రమార్గంలో పయనిస్తూ శాఖ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారు. పేరుకే ఫ్రెండ్లీ పోలీసులమనే పంథాను చేతల్లో చూపుతున్నారు. చట్టాలు, నిబంధనల్ని తోసిరాజని.. తమకు నచ్చిన తీరుతో బాధితులతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. శాంతిభద్రతలు, నేరాల అదుపుపై దృష్టి పెట్టడం కన్నా 'మాకేంటి లాభమనే' విధంగా కొందరు వ్యవహరిస్తున్నారు. అవసరమైన వాటి విషయంలో కాకుండా అనవసరమైన వాటి విషయంలో దూకుడును ప్రదర్శిస్తున్నారు.

అవినీతి బాటలో..

ఈ ఏడాది జూన్ 23న జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన ఓ ఎస్సై మధ్యవర్తి ద్వారా లంచం తీసుకునేందుకు ప్రయత్నించిన తీరు సంచలనాన్ని రేకెత్తించింది. అనిశా అధికారులకు చిక్కకుండా ఆయన పరారైన తీరు పోలీసు శాఖకు తలవంపులు తెచ్చింది. గతంలోనూ సిరిసిల్ల జిల్లాలో ఇసుక ట్రాక్టర్‌ను విడిపించేందుకుగానూ లంచం అడిగారనే నెపంతో సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లను ఎస్పీ కార్యాలయంలోనే అనిశా అధికారులు పట్టుకున్న సంగతి ఇంకా ప్రజలు మరిచిపోలేదు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భూమాఫియాకు వత్తాసు పలికారనే అభియోగాలతో సొంత శాఖ ఉన్నతాధికారుల విచారణను నలుగురైదుగురు ఎదుర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలోనూ అక్కడక్కడా పోలీసులు అత్యుత్సాహాన్ని చూపించిన ఉదంతాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కీలకమైన ఠాణాల్లో కొందరు కేసుల సెటిల్‌మెంట్లకు అడ్డాగా మార్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుక, క్వారీలు, ఇతరత్రాలుగా నెలవారీ మామూళ్ల నెపంతో అమ్యామ్యాలను అందుకుంటున్నారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

హెచ్చరిస్తున్నా.. మార్పు లేదు

ప్రభుత్వంతోపాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పోలీసుల వైఖరిలో మంచి మార్పు తీసుకు రావాలని పలుమార్లు హెచ్చరిస్తున్నా.. పలువురి వైఖరి మాత్రం మారడం లేదు. ఎవరేమంటారనే ధీమాతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. అప్పుడప్పుడు వెలుగు చూస్తున్న అక్రమాలు, ఆరోపణలు శాఖకు మచ్చకు తీసుకొస్తున్నప్పటికీ ప్రజలతో వ్యవహరించే తీరులో ఇంకా మార్పు రావడం లేదు. కేసు నమోదు చేయాలన్నా.. నమోదు కాకుండా ఆపాలన్నా.. ఇంత రేటని వసూలు చేయడం చాలా ఠాణాల్లో కొనసాగుతోందన్న ఆరోపణలున్నాయి. ఇక కొందరు తమ మార్కు ఇదేననే విధంగా మాటలతో బాధితులపై విరుచుకుపడుతున్న ఉదంతాలున్నాయి. మర్యాద మాట అటుంచితే 'అరేయ్'.. అనే హూంకరింపు మొదలు బూతు పదాలతో రెచ్చిపోతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 10న మెట్‌పల్లి ఠాణా ప్రాంగణంలో మహిళను పక్కకు నెట్టి లాఠీ ఎత్తిన సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇలా ఎక్కడికక్కడే పోలీసు సేవల్లో ఇబ్బందికర పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో మార్పు వచ్చేవిధంగా ఉన్నతాధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బాలలు.. ఇక పర్యాటక నేస్తాలు

పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లు

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పర్యాటకంపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ప్రభుత్వం యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది.

పాఠశాలల్లో ఏడు నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులతో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 25 నుంచి 29 మంది సభ్యులుగా ఉంటారు. ప్రతి క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా ఉంటాడు. ఈ క్లబ్‌లు పర్యాటక రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై దృష్టి సారిస్తాయి.



■ క్లబ్ సభ్యులు విద్యార్థులలోని ఉత్సాహం, సాహసోపేతం, సృజనాత్మకత, ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారు. ■ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజ్ఞాన, విహార యాత్ర, శాస్త్ర సాంకేతికత, ఉన్నత విద్యాసంస్థలు, చారిత్రక కట్టడాల సందర్శనలు చేసి తోటి విద్యార్థులకు అక్కడి విశేషాలను వివరించనున్నారు.

■ జిల్లాలోని పాఠశాలల్లో సోమవారం నుంచి ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు ఈ క్లబ్‌లను ఏర్పాటు చేస్తుంది. విద్యార్థులు, యువతకు దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలపై తర్వాత తరానికి అవగాహన కల్పిస్తాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తప్పనిసరిగా పాఠశాలల్లో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయాలి.

- శైలజ, జిల్లా సమన్వయకర్త

దేశంలో ముఖ్యంగా రాష్ట్రంలోని విభిన్న సంస్కృతులు, భౌగోళిక పరిస్థితుల గురించి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం, పర్యాటకం, పర్యావరణం, ప్రకృతి పట్ల స్నేహం, ప్రయాణ మనస్తత్వాన్ని నేటి యువతలో ఈ క్లబ్‌లు పెంపొందిస్తాయి.

ప్రచారమే లక్ష్యం

■ యువత, రాబోయే తరానికి పర్యాటక ప్రాముఖ్యతను వివరిస్తూ దేశంలోని అనేక కళలు, సాంస్కృతిక రూపాల ప్రశంసలకు దోహదపడే విభిన్న కార్యకలాపాలను చేపడతాయి.

■ పర్యాటకం, తెలంగాణ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాయి.

■ విద్యార్థులతో ఈ ప్రాంత పర్యాటకంపై ప్రచారం చేసే బాధ్యతను ఈ క్లబ్‌లు తీసుకొంటాయి.

ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల

బోయినపల్లి, న్యూస్‌టుడే : మధ్యమానేరు జలాశయం నుంచి ఎల్ఎండీకి శుక్రవారం ఆరు గేట్ల నుంచి 13,930 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 12,100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి 40,586 క్యూసెక్కుల వరద వస్తుండగా 4 స్పిల్‌వే గేట్లద్వారా 12,496 క్యూసెక్కులను, ఎస్కేప్ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల మిగులు జలాలను శుక్రవారం గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ, విద్యుత్తు ఉత్పత్తికి 6,800 నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది.

గోదావరిఖని: ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తి 1.47 లక్షల క్యూసెక్కుల నీటిని శుక్రవారం దిగువకు వదిలారు. మధ్యాహ్నం అనంతరం ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో దిగువకు నీటిని వదిలారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ నుంచి 81,224 క్యూసెక్కులు, వరద నీరు 66,259 క్యూసెక్కులు చేరడంతో బ్యారేజీ నీటి మట్టం పెరిగింది. అప్రమత్తమైన అధికారులు 14 గేట్లను ఎత్తారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
చందుర్తి: 9493188772
గంభీరావుపేట: 8008573611

న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

? సిరిసిల్లలోని సాయినగర్‌లో కాలువలు లేకపోవడంతో తాత్కాలికంగా తవ్వారు. అందులో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగి మురుగు నిల్వ ఉండటంతో దోమలు, ఈగల బెడద పెరిగింది. కాలువలను శుభ్రం చేయించాలి. - **శేఖర్, సాయినగర్ కాలనీవాసి**

✔ పారిశుద్ధ్య కార్మికులకు చెప్పి కాలువలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు వెంటనే తొలగిస్తాం. - **నవీన్, సాయినగర్ పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జి**


బాండ్ అందజేస్తున్న స్నేహితులు

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే : తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కొండ లక్ష్మీరాజం ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య, పిల్లల పరిస్థితిని చూసి లక్ష్మీరాజంతో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు రూ.1.5 లక్షలను బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను వారికి అందజేశారు.

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎర్రవెల్లి శంకర్ అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం అతనితో చదువుకున్న చిన్ననాటి మిత్రులు బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మిత్రులు కడగండ్ల తిరుపతి, నవాబు, బొలుమాల ఆంజనేయులు, పైసా మోజెస్, ఎర్రవెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం




రుద్రంగి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి అంచులు పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురయ్యాయి. ఈ మార్గం నుంచి వెళ్లే వారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే ఆస్కారం ఉంది. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, రుద్రంగి

శిథిలావస్థకు విద్యుత్తు స్తంభం



సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ఎదుట విద్యుత్తు స్తంభం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉంది. అక్టోబరు 9 నుంచి 19 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారు. పట్టణంలో రథోత్సవం నిర్వహించిన అనంతరం రథాన్ని విద్యుత్తు స్తంభం పక్కనే పెడతారు. ఏ క్షణంలో విరిగి పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పాతది తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై సెస్ టౌన్-2 ఏఈ మధుకర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా దానిని వెంటనే తొలగిస్తామని తెలిపారు.
- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

ముళ్ల చెట్లతో ఇబ్బందులు



కరీంనగర్- వేములవాడ ప్రధాన రహదారి నాంపల్లి చెరువు కట్ట సమీపంలో ముళ్ల చెట్ల కొమ్మలు రహదారిపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవి ద్విచక్రవాహనదారులను గుచ్చుకుంటున్నాయి. ఎదురుగా వాహనాలు వచ్చే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వేములవాడ గ్రామీణం**

అనంతగిరిలో పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: అనంతగిరి గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో పెండింగ్ ఉన్న పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి ఆర్ అండ్‌ఆర్ కాలనీ, ఇల్లంతకుంటలోని ఇందిరమ్మ కాలనీ, కస్తూర్బా పాఠశాల, సిరికొండ గ్రామంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి పర్యటించారు. అనంతగిరిలో మౌలిక వసతులు ఇంకా పూర్తి కాలేదని వారి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలో మౌలిక వసతులను పరిశీలించారు. అనంతగిరి రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్‌ను కోరారు. సిరికొండ గ్రామంలో రంగనాయక్ సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల నష్టపోతున్న పట్టా భూములను పరిశీలించారు. పెద్దలింగాపూర్ చెరువు నీటి వల్ల ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీవాసులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు అందించడానికి కృషి చేస్తామన్నారు. ఇల్లంతకుంటలోని ఇందిరమ్మ కాలనీలో సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కస్తూర్బాలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణం పూర్తికి కలెక్టర్ గ్రాంట్ ద్వారా నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఫారూక్, ఎంపీడీవో శశికళ, పంచాయతీరాజ్ ఏఈ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: వేములవాడలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉన్న బోధన సిబ్బంది పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 28 నుంచి అక్టోబరు 5లోగా కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు చరవాణి నంబరు 9949771639లో సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేకాధికారిపై ఫిర్యాదు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామానికి చెందిన గుత్తేదారు ఏసుగు కేశవరావు గంభీరావుపేట గ్రామ పంచాయతీలో నాలుగు గదులతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు మూత్రశాలలను నిర్మించారు. నిధుల కొరతతో బిల్లులు చెల్లించలేదు. దీంతో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో నడుస్తుంది. ఇటీవల కేంద్రం నుంచి గంభీరావుపేట గ్రామ పంచాయతీకి రూ.10,54,000 రాగా అందులో కొంత మేరకు బిల్లులు ఇవ్వాలని ప్రత్యేకాధికారి రాజేందర్‌ను మొరపెట్టుకున్నారు. రూ. 13 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని, అధికారులు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కలెక్టర్, జిల్లా సీఈవోలకు శుక్రవారం గుత్తేదారు ఫిర్యాదు చేశారు.

వంతెన నిధుల మంజూరుకు వినతి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి చెందిన రేవంత్ మిత్ర మండలి, టీమ్ రేవంత్ జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, పలు సమస్యలను విన్నవించారు. కోరుట్లపేట సమీపంలో పారేటి వాగుపై వారధి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే సత్యం సానుకూలంగా స్పందించినట్లు విజయ్‌రెడ్డి పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

జిల్లాలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అధికారులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే బృందం


కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



వేములవాడలో పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి


ఎల్లారెడ్డిపేట: నివాళులర్పిస్తున్న పద్మశాలి సేవా సంఘం నాయకులు


పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ చంద్రయ్య...


సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో...


తంగళ్లపల్లిలో...


చందుర్తిలో...


బోయినపల్లి ఏఎంసీలో...


సిరిసిల్ల: బీసీ స్టడీ సర్కిల్‌లో...


ముస్తాబాద్‌లో...


సిరిసిల్ల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో...

ఎవరికి వ్యతిరేకంగా పోరాడాలో చెప్పండి

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల మరమగ్గాల కార్మికులు, ఆసాములు ఎవరికి వ్యతిరేకంగా పోరాడాలో చెప్పాలని లాల్ బావుట చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి పేర్కొన్నారు. సిరిసిల్లలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. సిరిసిల్ల కార్మికవర్గం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ చెప్పారని, ఎవరిపై పోరాడాలో కూడా చెప్పాలన్నారు. గత భారాస ప్రభుత్వం పాపాల ప్రక్షాళన దిశగా ఆలోచన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, లేక సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణమైన భారాసపైనా చెప్పాలని ప్రశ్నించారు. బతుకమ్మ చీరలకు సంబంధించి రూ. 272 కోట్లు ఇవ్వకుండా విద్యుత్ సమస్యపై తమ కార్యకర్తలతోనే కోర్టులో కేసులు వేయించి 50 శాతం రాయితీ ఇవ్వకుండా ఎగవేసిన భారాస ప్రభుత్వంపైన పోరాటం చేయాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కేటీఆర్ ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలన్నారు. నిజంగా సిరిసిల్ల నేతన్నలపై ప్రేమ ఉంటే స్థానిక సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు అజ్జ వేణు, ఎలిగేటి రాజు, గాజుల లింగం, సదానందం తదితరులు పాల్గొన్నారు.

విప్‌ను కలిసిన గుడిచెరువు ఎఫ్‌టీఎల్ బాధితులు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడలో గుడి చెరువు ఎఫ్‌టీఎల్‌లోని పలువురు బాధితులు శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. ఎఫ్‌టీఎల్ బాధితులు విప్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

ముస్తాబాద్, న్యూస్‌టుడే: నిత్యావసర ధరలకనుగుణంగా కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రాజశేఖర్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని హమాలీ సంఘం కార్యాలయంలో భవన నిర్మాణ రంగం, హమాలీ కార్మిక సంఘం నాయకులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచినట్లయితే కొంత ఊరట లభిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలోని ముప్పై పడకల ఆసుపత్రి నిర్మిస్తామని చెప్పి నిర్మించిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా చొరవ తీసుకొని నిర్మించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గీస భిక్షపతి, మండల హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

సిరిసిల్లగ్రామీణం, న్యూస్‌టుడే : గల్ఫ్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జ్యోతిరావుపులే ప్రజా భవన్‌లో ప్రవాసి ప్రజావాణి గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభించిన సందర్భంగా సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సెప్టెంబర్ 17న జీవోను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, రాష్ట్ర నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, కూస రవీందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యుడు కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యేగా 5 సార్లు గెలిచిన కేటీఆర్ స్థానికులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి, రోస్టర్ పద్ధతిలోనే రేషన్ డీలర్ల నియామకం జరిగినట్లు చెప్పారు. నాయకులు ప్రజల్లో ఉండాలి తప్ప ట్విటర్‌లో కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కామిని వనిత, పట్టణ అధ్యక్షురాలు స్వరూప, నాయకులు సూర దేవదాస్, గోనె ఎల్లప్ప, మాన్య ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ సాహసోపేతమైన నిర్ణయం

వేములవాడ, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చాక రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని ఏకకాలంలో చేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏనుగు తిరుపతిరెడ్డి, వేములవాడ ఏడీఏ రామారావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేశ్, సంఘం సభ్యులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


రాజేశం

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వేములవాడ గ్రామీణ మండలం మర్రిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వేములవాడ గ్రామీణం ఎస్సై మారుతి తెలిపిన కథనం ప్రకారం... అచ్చనపల్లికి చెందిన దానే రాజేశం (48) కొన్నాళ్లుగా మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజేశం రాకపోవడంతో కుటుంబ సభ్యులు వేములవాడ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం మర్రిపల్లి చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య అంజవ్వ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ...

బోయినపల్లి, న్యూస్‌టుడే: విలాసాగర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య (58) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. ఎల్లయ్య మద్యానికి బానిసయ్యాడని, ఈనెల 18న రాత్రి పురుగు మందు తాగి బంగ్లాపై పడుకున్నాడని పేర్కొన్నారు. గమనించిన ఎల్లయ్య భార్య లక్ష్మి చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించినట్లు చెప్పారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురికి గాయాలు
ఒకరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ శివారులో శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో వెంకటాపూర్ గ్రామానికి చెందిన మామిండ్ల అంజయ్య, కంకణాల శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేటకు చెందిన మణిదీప్, రాగట్లపల్లివాసి మందాటి లక్ష్మణ్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వీరిలో మామిండ్ల అంజయ్య పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డిపేటకు చెందిన మణిదీప్, రాగట్లపల్లికి చెందిన మందాటి లక్ష్మణ్ వేములవాడలో స్వామివారిని దర్శించుకొని కామారెడ్డి- కరీంనగర్ ప్రధాన రహదారి గుండా తమ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్నారు. మామిండ్ల అంజయ్య, కంకణాల శ్రీనివాస్ హరిదాస్‌నగర్ శివారులో తమ స్థలాన్ని చూసి, ద్విచక్రవాహనంపై వెంకటాపూర్ వైపు మళ్లేందుకు రోడ్డెక్కుతుండగా రెండు వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన మామిండ్ల అంజయ్యను కుటుంబీకులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నేర వార్తలు

ఇద్దరు అదృశ్యం... కేసు నమోదు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణ పరిధిలోని చంద్రపేటకు చెందిన మ్యాన భాస్కర్ ఈనెల 26 నుంచి కనిపించడం లేదని అతని భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే సిరిసిల్లలోని సుందరయ్యనగర్‌కు చెందిన నాయిని రాజయ్య ఈ నెల 23న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని కొడుకు శ్రీకాంత్ ఫిర్యాదు చేశాడు. ఈ రెండు సంఘటనలపై వేర్వేరుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి శివారులో ఓ వాహనానికి శుక్రవారం పెనుప్రమాదం తప్పింది. ఆయిల్ లోడ్‌తో కామారెడ్డి నుంచి జగిత్యాల వెళ్తున్న వ్యాన్ టైరు పగిలిపోవడంతో అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొని వంతెన మధ్యలో ఓ పక్కకు ఒరిగి నిలిచిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి, బోల్తా పడకుండా నిలువరించడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వ్యాన్‌లో ఉన్న ఆయిల్ కొంత మేర రోడ్డుపై పడిపోయింది.

నాటుసారా, బెల్లం, పటిక పట్టివేత

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: గంభీరావుపేట మండలం నాగంపేట తండాలో నాటుసారా తయారీకి ముడిసరకుగా వినియోగించే 50 కిలోల బెల్లం, 10 కిలోల పటికతోపాటు 5 లీటర్ల గుడుంబాను కారులో రవాణా చేస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన అజ్మీరా నాజం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, కారును స్వాధీనపరచుకున్నట్లు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట మండలం నాగంపేట, లింగన్నపేట, లక్ష్మీపూర్‌తండాలకు నాటుసారా తయారీ ముడిసరకు రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టామని చెప్పారు. కారును సోదా చేయగా బెల్లం, పటిక, గుడుంబా లభించాయన్నారు. నిందితుడిని పట్టుకున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్లు రాజు, మల్లేశ్, కిశోర్, భవాని, కృష్ణకాంత్‌లను ఎక్సైజ్ సీఐ అభినందించారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

బోయినపల్లి, న్యూస్‌టుడే: జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన వలస కార్మికుడి మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరుకుంది. బోయినపల్లికి చెందిన దాసరి బాబు(45) స్థానికంగా ఉపాధి లేకపోవడంతో సుమారు పన్నెండేళ్లుగా ఒమన్ వెళ్తున్నాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్లాడు. డ్రైవర్‌గా పని చేస్తున్న బాబు ఈనెల 17న విధులు ముగించుకున్న అనంతరం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సమాచారాన్ని తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు తెలిపారు. పది రోజుల అనంతరం మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య భాగ్య, కూతుళ్లు అర్చన, ఆకాంక్ష ఉన్నారు. కాగా గల్ఫ్ కార్మికుల కోసం ఎన్నారై పాలసీ అమలు చేయాలని గతంలో చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్నాడు. బాబు మృతదేహంపై ఎన్నారై జెండా కప్పి గల్ఫ్ కార్మికులు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కాగా బాధిత కుటుంబాన్ని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం పరామర్శించారు.

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలంలోని వంతడ్పుల పంచాయతీ పరిధిలోని తెనుగువానిపల్లెకు చెందిన బోయిని గణేశ్(32) అనే వలసజీవి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. గణేశ్ ఉపాధి నిమిత్తం గత నాలుగు సంవత్సరాలుగా దుబాయ్ వెళ్లి వస్తున్నాడు. గ్రామంలో ఇల్లు నిర్మించగా కొంత అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో నెల రోజుల కిందట అక్కడ పురుగు మందు తాగగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా శుక్రవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.